ప్రతి సోమవారం రెవెన్యూ క్లినిక్ కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయనగరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం ఉదయం 10.00 గంటలకు రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ముగ్గురు రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు తప్పనిసరిగా ఉదయం 10.00 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించే రెవెన్యూ క్లినిక్‌కు హాజరుకావాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఆర్‌డీఓ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలలో దరఖాస్తులు స్వీకరించేందుకు సంబంధిత ఏఓ, డీటీ లు అందుబాటులో ఉండాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే రెవెన్యూ క్లినిక్‌కు మండల సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు తమకు సంబంధించిన అన్ని రికార్డులతో తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.రైతులు మరియు ప్రజలు తమ భూసంబంధిత సమస్యలు, రెవెన్యూ సమస్యలను ఈ రెవెన్యూ క్లినిక్ ద్వారా పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

మంత్రిగారూ.. రైతుల ధీనావస్థ కనిపించలేదా..!

పొలం దాటని ధాన్యం.. మిల్లుకు చేరేదెట్లా..

తప్పెవరిదైనా.. కష్టాలు మాత్రం రైతులకే..



విశాలాంధ్ర-జామి: ధాన్యం సేకరణ ఈఏడాది ముందుగానే ప్రారంభించాం. రైతులకు ధాన్యం మిల్లుకు వెళ్ళిన వెంటనే 48 గంటల్లో వారి ఖాతాలలో నగదు చేరుతుంది.. ఇది జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పిన మాటలు. గతంలో ప్రభుత్వం కన్నా మెరుగైన విదంగా దాన్యం సేకరణ విదానం ఉంటుందని చెబితే రైతులు సంతోషించారు. కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం సీన్ రివర్స్ అయింది.

పొలాలనుంచి మిల్లుకు చేరని ధాన్యం..

ఈఏడాది అధికంగా పంట పండిందని రైతులు సంతోషించే సమయంలో అధికార పార్టీ పకడ్బందీగా విదానాన్ని అమలు చేస్తుందని తెలుసుకుని మరింత సంతోషించారు. వంట చేతికందగానే మిల్లులకు నేరుగా తరలించవచ్చని భావించారు. కానీ ధాన్యం తరలించేందుకు రైతు సేవాకేంద్రాలకు వెళితే ట్రాక్‌షీట్లుకు నరకం చూపిస్తున్నారు. మరోవైపు జామి మండలానికి ఆదుకుంటుందనే నమ్మకం ఉన్న గంట్యాడ మండలంలోని మిల్లులుకు బ్యాంకు గ్యారంటీలు లేవనే షాకుతో రవాణా నిలిపి వేసారు. దీంతో దాదాపు 30 కిలోమీటర్లు దూరంలో ఉన్న చీపురుపల్లికి తరలించు కోవాలని వ్యవసాధికారులు రైతులకు చెబుతున్నారు. పొలాల్లో ధాన్యం కుప్పలు, నాటుబళ్ళు మీద, ట్రాక్టర్ల మీద లోడింగ్ చేసిన ధాన్యం బస్తాలను చూస్తున్న రైతులు ఎంత దూరమైనా ట్రాక్‌షీట్లు ఇవ్వాలని కోరుతున్నారు. కానీ ప్రస్తుతం ట్రాక్‌షీట్లు జనరేట్ అవ్వడంలేదని రైతు సేవాకేంద్రాలలో చెబుతుం డడంతో రైతులు పడిగాపులు కాస్తున్నారు.

గతంలో ఎన్నడూ లేని విదానం..

గతంలో మిల్లులకు ధాన్యం సక్రమంగా వెళ్ళేది. అయితే మిల్లుల యజామానులు అధికంగా ధాన్యం తీసుకుంటున్నారనే ఆరోపణలు మాత్రమే ఉండేవి. డబ్బులు కూడా రైతుల ఖాతాలలో చేరేందుకు కొంత ఆలస్యమయ్యేది. కానీ ఈసారి మాత్రం అసలు ధాన్యం పొలాలనుంచి బైటకు రావడం లేదు. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. ట్రాక్టర్లుకు లోడింగ్ చేసి రైతులు ఆయా ట్రాక్టర్‌ల అద్దెలకు చెల్లించలేక బావురుమంటున్నారు. మంత్రి శ్రీనివాస్ జోక్యం చేసుకుని సొంతమండలమైన గంట్యాడలోని మిల్లులనుంచి బిజీలను కట్టించి వెంటనే ధాన్యం సేకరణ చేయించాలని రైతులు కోరుతున్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

గ్రంథాలయ అధికారి కే శ్రీనివాస్ పిలుపు

విశాలాంధ్ర – గంట్యాడ: గ్రంథాలయాలకు సెలవు రోజుల్లో వచ్చి పుస్తక పఠనం చేయాలని గ్రంథాలయ అధికారి కే శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గంట్యాడ మండల కేంద్రం లో గల శాఖ గ్రంథాలయంలో లిచదవడం మాకిష్టంలి అనే కార్యక్రమంలో మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీ సమయాలలో గ్రంథాలయాలు కు రావాలని వచ్చి రామాయణం, మహాభారతం, భాగవతం తో పాటు జాతక కథలు వంటి నీతి కథలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి అని అన్నారు. అలాగే మండలంలో గల నిరుద్యోగ యువత గ్రంథాలయంలో గల పోటీ పరీక్షల పుస్తకాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులచే కథల పుస్తకాలు చదివించి, వారిచే ఆటలు ఆడించడం జరిగినది.

వెంకటాపురంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర – రేగిడి: విజయనగరం జిల్లా రేగిడి మండలం వెంకటాపురం గ్రామంలో ఆదివారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవితం, భారత రాజ్యాంగ నిర్మాణంలో ఆయన కీలక పాత్ర, అలాగే బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన నిరంతర పోరాటాన్ని స్మరించారు. అంబేద్కర్ ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, దళిత నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

దళారీల గుప్పెట్లో రైతు ధాన్యం..!

బీజీలు ఇవ్వని మిల్లర్లు

ప్రభుత్వ ఆదేశాలు కాగితాలకే పరిమితం..!

రూ.2389 ధర కాగితాలపై రైతు చేతికి రూ.1700లే..!

కొనుగోలు కేంద్రాలు పేరుకే ...కల్లాల్లోనే మగ్గి పోతున్న ధాన్యం..!

విశాలాంధ్ర-వేపాద: ప్రభుత్వం వచ్చినా రైతు సంక్షేమం, రైతు ఆర్థిక బలోపేతం అంటూ హామీల వర్షం కురిపించడమే తప్ప, ఆ హామీల్లో ఒక్కటీ కనిపించడం లేదన్నది వేపాడ మండల రైతుల ఆవేదన. ఆరుగాలాల కష్టంతో పండించిన వరి ధాన్యాన్ని ప్రతి గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది అంటూ చెప్పిన మాటలు ఈ ఏడాది ఖరీఫ్‌లో వట్టిమాటలుగానే మిగిలిపోయాయి. వేపాడ మండలంలో 2025 ఖరీఫ్ సీజన్‌లో 3435 హెక్టార్లలో వరి సాగు చేయగా, 18 వేల టన్నులకుపైగా దిగుబడి వచ్చిందని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. రైతుల స్వీయ వినియోగాన్ని మినహాయిస్తే 12 వేల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి ఉంది. ఈ లక్ష్యంతో మండలంలో 9 క్లస్టర్ల ద్వారా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.మహిళా సంఘాల ద్వారా నల్లబిల్లి, బల్లంకి, కుమ్మపల్లి,వ్యవసాయ సహకార సంఘాల ద్వారా దబ్బిరాజుపేట,సోంపురం, వేపాడ,రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా జాకేరు, కేజీపూడి, బొద్దాం క్లస్టర్లలో కొనుగోలు జరగాల్సి ఉంది.కానీ నిజానికి ఇప్పటివరకు కేవలం 5 వేల టన్నుల ధాన్యమే కొనుగోలు జరిగిందని అధికారులే లెక్కలు చెబుతున్నారు.అంటే మిగిలిన వేల టన్నుల ధాన్యం దళారీల చేతుల్లోకి,వెళ్లిపోయింది.ప్రభుత్వం ప్రకటించిన ధరలు

గ్రేడ్-1 ధాన్యం : రూ.2389, సాధారణ రకం : రూ.2369కానీ ఈ ధరలు రైతులకు కాగితాలపైనే తప్ప నేలమీద అమలుకావడం లేదు.మండలంలో రామస్వామిపేటలో ఒక్క రైస్ మిల్లు మాత్రమే ఉండగా దానికి బ్యాంకు గ్యారంటీలు (బీజీలు) లేవు.పక్క మండలాల్లోని మిల్లులకు ధాన్యం తరలించాలంటే అక్కడ క్వింటాకు 5%-%6 కేజీల వరకు అక్రమ తరుగు విధిస్తూ రైతుల రక్తం పిండుతున్నారు. చేసేదేమీ లేక మిల్లర్లు చెప్పిందే వినాల్సిన పరిస్థితి రైతులది.ఇక ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల పరిస్థితి మరింత దారుణం.ధాన్యం అమ్మాలంటే 15 నుంచి 20 రోజులు వేచిచూడాలి. ఈలోపే తేమ పెరిగి, తరుగుదల ఎక్కువై రైతుకు మరింత నష్టం. ట్రక్ షీట్లు, జీఎస్టీ వాహనాలు, బీజీలు అంటూ ఒకరి తర్వాత ఒకరు చేతులెత్తేస్తు న్నారు. చివరకు విసిగి వేసారి, రూ.2389 ధరను వదులుకుని, రూ.1700లకే దళారీలకు ధాన్యం అమ్ముకోవాల్సిన దుస్థితి రైతులది.ప్రభుత్వాన్ని నమ్మి నిండామోసపోయామని రైతులు లబోదిబోమం టున్నారు.మండలానికి జాయింట్ కలెక్టర్ వచ్చి హడావుడి చేసినా ఫలితం మాత్రం శూన్యం.ప్రభుత్వం నుంచి గానీ, మిల్లర్ల నుంచి గానీ, వ్యవసాయ అధికారుల నుంచి గానీ,రైతులకు ఏ మాత్రం సహకారం అందలేదన్నది కఠోర నిజం.వరి కోతలు పూర్తై నెల 15 రోజులు దాటినా నేటికీ ధాన్యం కల్లాల్లోనే మగ్గిపోతుండగా రైతులు అప్పుల ఊబిలో మరింత కూరుకుపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి దళారీలను పక్కకు నెట్టేసి, సకాలంలో ప్రభుత్వ కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను నమ్మి మోసపోయాం : - నల్లబిల్లి గ్రామానికి చెందిన రైతులు రండి మహేష్, ముసలి నాయుడు, నాగిరెడ్డి మల్లు నాయుడు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.బీజీలు ఉన్న మిల్లులకు ధాన్యం తరలిస్తే అక్కడ క్వింటాకు ఆరు కేజీలకు పైగా తరుగు తీస్తూ రైతులను దోచుకుంటున్నారని వారుమొరపెట్టుకున్నారు.ఇప్పటికైనా జిల్లా అధికారులు కళ్లు తెరిచి,దళారీల దందాకు చెక్ పెట్టి, రైతుల చెమటకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

పండూరు వేణుగోపాల్‌కు సి.వి. రమన్-మేడం క్యూరీ అవార్డ్ ప్రధానం

విశాలాంధ్ర . రాజాం: కె.వి.ఆర్, జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న పండూరు వేణుగోపాల్‌ను రాష్ట్ర స్థాయి ఉత్తమ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా గుర్తించి సి.వి. రమన్-మేడం క్యూరీ అవార్డ్‌తో సత్కరించారు. ఈ అవార్డును గుంటూరు రెవిన్యూ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంఎల్సీ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్. లక్ష్మణరావు ప్రదానం చేశారు. విద్యారంగంలో వినూత్న బోధనా విధానాలు, విద్యార్థుల్లో శాస్త్రంపై ఆసక్తి పెంపొందించడంలో వేణుగోపాల్ చేసిన కృషిని ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.వి. వసంత కుమార్, పాఠశాల సెక్రటరీ మజ్జి మదన్ మోహన్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొని అభినందనలు తెలిపారు. అలాగే కంచరాం గ్రామ ప్రజలు వేణుగోపాల్‌ను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ గౌరవం కంచరాం పాఠశాలకే కాకుండా కంచరాం గ్రామానికి గర్వకారణమని గ్రామస్తులు పలువురు పేర్కొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని ఏపీయూడబ్ల్యూజే డిప్యూటీ జనరల్ సెక్రటరీ పిఎస్ఎస్ వి ప్రసాద్ అన్నారు. విజయనగరం జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులకు చేదోడువాదోడుగా ఉంటామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఐజేయు ఫ్లీనరీ ఆవిష్కరించారు. విజయనగరం జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు లింగాల నరసింగరావు వృత్తిపరంగా అనేక సమస్యలను ఎదుర్కొంటున్న జర్నలిస్టులు తమ ఆరోగ్యాన్ని గురించి పట్టించుకోవడం లేదని చెప్పారు. జర్నలిస్టులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. అనారోగ్యానికి గురైన జర్నలిస్టులకు సంక్షేమ సంఘం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వేదుల సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్ట్ వెలిశెట్టి సురేష్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంఎస్ ఎన్ రాజు, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు టి రాధాకృష్ణ, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు సన్యాసిరావు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వివిఎం పాత్రో, ఉపాధ్యక్షుడు పంచాది అప్పారావు,చిన్న పత్రికల సంఘం అధ్యక్షుడు కెజె శర్మ, ప్రధాన కార్యదర్శి సముద్రాల నాగరాజు తోపాటు అనేకమంది పాత్రికేయులు పాల్గొన్నారు..

ఘనంగా హిందూ సమ్మేళనం

విశాలాంధ్ర-రాజాం : రాజాం మండలం కంచరాం గ్రామంలో అయ్యప్ప స్వామి ఆలయం ఆవరణలో ఆదివారం హిందూ సమ్మేళనం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు హిందూ సనాతన ధర్మాలు, వాటి ఆధ్యాత్మిక-సాంస్కృతిక ప్రాముఖ్యతపై విస్తృతంగా వివరించారు. సమాజంలో హిందువుల ఐక్యతను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా హిందూ సమ్మేళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భారతదేశ సంస్కృతికి మూలస్తంభంగా నిలిచిన సనాతన హిందూ ధర్మం గొప్పదనం ప్రపంచానికే తెలిసిన విషయమని, అది శాంతి, సహనం, మానవత్వాన్ని బోధిస్తుందని వక్తలు పేర్కొన్నారు. అలాగే కులభేదాలు లేని హిందూ సమాజ నిర్మాణమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అల్లాడ జనార్ధన రావు, విశుద్ధనంద గురూజీ, కదారు సింహాచలం, పిల్లా కృష్ణ, టంకాల పాపినాయుడు గురు స్వామి హాజరై ప్రసంగిం చారు. వారు హిందూ ధర్మం యొక్క గొప్పతనం, మన దేశ విశిష్టత, హిందువుల ఐక్యత అవసరం గురించి వివరంగా మాట్లాడారు. సనాతన విలువలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని సూచించారు.ఈ హిందూ సమ్మేళనంలో సుమారు 600 మందికి పైగా భక్తులు, గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం చివర్లో నిర్వాహకులు పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సిటూ జాతీయ మహాసభలను విజయవంతం చేయండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టీ వి రమణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సిఐటియు అఖిలభారత మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కోట జంక్షన్ నుండి మూడు లంతర్ల మీదుగా గంటస్తంభం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న మహిళా కార్మికులు,నాయకులు ఎర్రచీరలు,ఎర్ర బనియన్లు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు .ర్యాలీని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ మాట్లాడుతూ డిసెంబర్ 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు ఆంధ్ర రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా సిఐటియు ఆల్ ఇండియా మహాసభ లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభల్లో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా లేబర్ కోడులకు వ్యతిరేకంగా దీర్ఘమైన చర్చ జరిపి కార్మిక హక్కులు చట్టాలను కాపాడుకోవడం కోసం నిర్ణయాలు చేయడం జరుగుతుందన్నారు. మోడీ ప్రభుత్వం అనేక పోరాటాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లు గా విభజించి కార్మికులకు హక్కులు లేకుండా పనిగంటలు పెంచుతూ కనీస వేతనాలు అమలు కాకుండా మహిళా కార్మికులకు రాత్రిపూట పనిచేయాలని కనీస వేతనాలు అమలుకాకుండా కార్మికులను కట్టు బానిసలుగా చేసేందుకు మోడీ ప్రభుత్వం లేబర్ కోడులను తీసుకొని రావడం జరిగిందన్నారు. అనేక ప్రాణ ఉద్యోగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుకను చేయడం మోడీ ప్రభుత్వ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుంది అనడానికి నిదర్శనం అన్నారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నంలో మహాసభలు సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక విధానాలపై పోరాట కార్యక్రమాలను రూపొందించుకోవడం, కార్మిక హక్కులను చట్టాలను కాపాడుకునేందుకు తగిన పోరాట కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. ఈ మహాసభలకు చివరి రోజు జనవరి 4వ తేదీన లక్షలాది మందితో ర్యాలీ బహిరంగ సభ విశాఖపట్నంలో జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలకు ఐదు దేశాల నుంచి కార్మిక సంఘాల నాయకులు పాల్గొనున్నారన్నారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు శ్రీలక్ష్మి, ఏ జగన్మోహన్రావు, బి రమణ,పి.రమణమ్మ, ఎన్ అనసూయ, బి సుధారాణి, పైడ్రాజు, అప్పలసూరి సిఐటియు నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

విజయనగరం జిల్లా సబ్ జూనియర్ టైక్వాండో పోటీలు ఘనంగా నిర్వహణ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : స్థానిక విజయనగరం శ్రీ వాసవి ఆర్యవైశ్య సొసైటీ భవనంలో విజయనగరం జిల్లా సబ్ జూని యర్ టైక్వాండో పోటీలు మరియు 39వ రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీలకు సెలక్షన్ ట్రయల్స్ ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. ఈ పోటీలకు విజయనగరం జిల్లా నుంచి సుమారు 100 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొ న్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ శ్రావణి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఏ క్రీడకైనా తాము అండగా ఉంటామని, టైక్వాండో ఒక ఒలింపిక్ క్రీడగా అంతర్జాతీయ గుర్తింపు పొందిందని తెలిపారు. జిల్లాలోని క్రీడాకారులు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో పథకాలు సాధించి విజయనగరానికి మంచి పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. అలాగే విజయనగరం జిల్లాలో టైక్వాండో క్రీడకు మంచి ప్రాచుర్యం ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ పోటీలకు సుంకరి సతీష్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించగా, ఆర్యవైశ్య చౌల్ట్రీ సంఘ సభ్యులు ఏ. శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొన్నారు. టోర్నమెంట్‌కు న్యాయ నిర్ణేతలుగా కోరాడ మణిరాజు, రామకృష్ణ, షర్మిల, ఉదయ్ కుమార్‌లు బాధ్యతలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతులు సాధించిన విజేతలు జనవరి 3, 4 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరగనున్న 39వ రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీల్లో విజయనగరం జిల్లా తరపున పాల్గొననున్నారు. ముగింపు కార్యక్రమంలో సుంకర సతీష్ కుమార్, శ్రీనివాస్ సహా సంఘ సభ్యులు విజేతలకు పతకాలు, బహుమతులు అందజేశారు. క్రీడాకారుల ప్రతిభను అభినందిస్తూ కార్యక్రమం ఉత్సాహభరితంగా ముగిసింది.

సూర్యచంద్రులున్నంత కాలం కమ్యూనిజానికి మరణం లేదు ఎర్రజెండా నేలకొరగదు

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్

విశాలాంధ్ర -విజయనగరం టౌన్: కమ్యూనిజం కనుమరుగైంది, ఎర్రజెండా పనైపోయింది అనుకునే వాళ్ళకి వందేళ్ళ ప్రజా, కార్మిక, కర్షక త్యాగాల ఉద్యమ ప్రస్థానం కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏర్పడిన తరువాత ఎన్నో రాజకీయ పార్టీలు పుట్టుకోచ్చాయి కాలగర్భంలో కలిసిపోయాయి కానీ భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) వందేళ్ళుగా సజీవంగా ఉంటూ ఎన్నో పోరాటాలు నడిపింది, ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలను చైతన్యపరుస్తూ ప్రభుత్వాలను గద్దె దించడంలో ప్రధాన భూమిక పోషిస్తున్నది సిపిఐ అని సమాధానం ఇచ్చారు. సిపిఐ 101 వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం విజయనగరం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో పడమర బల్జివీధి శాఖలో ఘనంగా నిర్వహించడం జరిగింది. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ సిపిఐ జెండ ఎగురవేశారు. అమరజీవి కామ్రేడ్ మొకర అప్పారావు విగ్రహానికి సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు అప్పురుభుక్త జగన్నాధం పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్. నాగభూషణం అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ సీపీఐ వెట్టి చాకిరి, బానిసత్వం కి వ్యతిరేకంగా పోరాడిందన్నారు. దున్నేవాడికె భూమి దక్కాలనే మొట్టమొదటిగా నినదించి పోరాడి భూస్వామ్య వ్యవస్థ పై భూపోరాటాల్లో ఎర్రజెండాలు నాటి లక్షలాది ఎకరాలను పేదలకు పంచిపెట్టిందన్నారు. సంస్థానాల్ని ప్రజలపరం చేసి రాచరిక వ్యవస్థ మట్టుబెట్టిందన్నారు. రాజభరణాల రద్దు, బ్యాంకులు జాతీయకరణ చేయించడంలో సిపిఐ మిలిటెంట్ పోరాటాలు నడిపిందన్నారు. నిరంతరం ప్రజా శ్రేయస్సు కోరుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలూ శ్రమిస్తోందన్నారు. నేడు దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ, ఏనాడూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఛాయలు కనిపించని ఆర్ఎస్ఎస్ ప్రస్తుతం దేశ రాజకీయాల్లో చక్రం తిప్పే స్థాయికి చేరుకొని చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు సాగిస్తున్నదన్నారు. గణతంత్ర, స్వతంత్ర భారత దేశాన్ని హిందూదేశంగా మార్చాలని ఆరాటపడుతోందన్నారు. అందుకోసం నరేంద్రమోడీ ప్రభుత్వం శాయశక్తులా కృషిచేస్తూ కార్పొరేట్ అనుకూల, ప్రజాకంటక విధానాలను అమలును వేగవంతం చేస్తోందన్నారు. ఈ క్రమంలో మోడీ సర్కారు రైతులు, సంఘటిత, అసంఘటితరంగాల కార్మికులు, శ్రామికులు, అణగారిన వర్గాల జీవితాలను వణంగా పెట్టిస్తోందన్నారు. వర్యవసానంగా అన్ని వర్గాల ప్రజల వెతలు వర్ణనాతీతమన్నారు. వారి హక్కులు కాలరాయబడుతున్నాయన్నారు. హిట్లర్ ని మరిపించే విధంగా మోడీ నియంతృత్వ విధానాలు అమలవుతున్నాయన్నారు. మోడీ కనుసన్నల్లో దేశంలో మతోన్మాదం పెచ్చరిల్లుతోందన్నారు. ప్రజాతంత్రవాదుల పై నిరాఘాటంగా దాడులు జరుగుతున్నాయన్నారు. ఈ పరిస్థితులలో కేంద్రంలోని నరేంద్రమోడీ నేతృత్వం వహిస్తున్న ఆర్.ఎస్.ఎస్ సారథ్యంలో ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించాలనే సంకల్పంతో దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, లౌకిక వ్యవస్థను పరిరక్షించుకునే ఆశయంతో కమ్యూనిస్టులు కంకణబద్దులు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆ స్ఫూర్తితో మహత్తర సిద్ధాంతాల వేదికగా ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ 101వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా వాడవాడలా ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాయి రమణమ్మ, బుగత పావని, పార్టీ శాఖ కార్యదర్శి పొందూరు అప్పలరాజు, ఎ.ఐ.ఎస్.ఎఫ్, ఎ.ఐ.వై.ఎఫ్ నాయకులు బూర వాసు, పి. గౌరీశంకర్, సి.హెచ్ చరణ్ హేమంత్ పార్టీ సభ్యులు, కార్మికులు పాల్గున్నారు.65..

డిజి-లక్ష్మి కామన్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

ప్రారంభించిన ఎమ్మెల్యే అదితి చే ప్రారంభం

విశాలాంధ్ర విజయనగరం ఫోర్ట్: విజయనగరం నియోజకవర్గం విజయనగరం పట్టణం 30వ డివిజన్ (ధర్మపురి)లో ఏర్పాటు చేసిన డిజి-లక్ష్మి కామన్ సర్వీస్ సెంటర్ ను శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ, మెప్మా ద్వారా అమలు చేస్తున్న డిజి-లక్ష్మి పథకం పట్టణ పేద మహిళలకు డిజిటల్ నైపుణ్యాల్లో శిక్షణ అందించి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రూపొందించబడిందని తెలిపారు. ఈ పథకం ద్వారా మహిళలు డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ (%ఋా్రం%)గా మారి వివిధ ఆన్‌లైన్ సేవలు అందిస్తూ ఆదాయం పొందగలరని, తద్వారా ఆర్థిక స్వావలంబన సాధిస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత సులభంగా, వేగంగా అందేలా ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మహిళా సాధికారత దిశగా డిజి-లక్ష్మి పథకం కీలక పాత్ర పోషిస్తుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి మాతృభూమి సేవా సంఘం చేయూత

విశాలాంధ్ర - వేపాడ:మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన ఒక నిరుపేద కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న విషయం రాకోడు గ్రామానికి చెందిన రామారావు ద్వారా తెలుసుకున్న మాతృభూమి సేవా సంఘం దాతల సహకారంతో ఆ కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు.ఈ సందర్భంగా సంఘ సభ్యులు మానవత్వంతో ముందుకు వచ్చి సహాయం చేయడం అభినందనీయమని గ్రామస్తులు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుడు,మాతృభూమి సేవా సంఘం సభ్యులు కిషోర్,సాయి తదితరులు పాల్గొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని సంఘ ప్రతినిధులు తెలిపారు.

అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్" ఆధ్వర్యంలో 'దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర -విజయనగరం ఫోర్ట్:అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అయ్యన్నపేట,కామాక్షినగర్ లో ఉన్న మున్సిపల్ నడకమైదానంలో స్థానికంగా ఉండే కొంతమంది నిరుపేద వృద్ధులకు క్లబ్ నూతన అధ్యక్షులు సి. హెచ్. రమణ ఆధ్వర్యంలో దుప్పట్లను పంచిపెట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన డిస్ట్రిక్ట్ 102 నూతన గవర్నర్ ఆరిగతోట తిరుపతి రావు మాట్లాడుతూ..చలికాలంలో వృద్ధులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వారిని ఆదుకునేందుకు క్లబ్ సభ్యులు ముందుకురావడం ఎంతో అభినందనీయమని క్లబ్ సేవలను కొనియాడారు.అనంతరం క్లబ్ పెద్దలు,మాజీ డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ ఎడ్ల గణేష్,గౌరవ సలహాదారులు,గౌరవ అధ్యక్షులు పిన్నింటి సూర్యనారాయణ, డాక్టర్ ఎ. ఎస్ ప్రకాశరావు మాష్టారు,త్యాడ రామకృష్ణారావు (బాలు) కోట్ల సత్యనారాయణ, వాకర్స్ క్లబ్, పుస్తక ఉద్యమకారులు నాలుగెస్సల రాజు మరియు సభ్యులంతా డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ ఎ. తిరుపతి రావు కు, ఎలక్ట్ గవర్నర్ త్యాడ చిరంజీవి రావు కు దుస్సాలువాలతో సత్కరించారు.కార్యక్రమంలో వాకర్స్ ఉద్యమకారులు కె. ఎర్నాయుడు మాష్టారు,ఎం. జనార్దన్ రావు,అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ కార్యదర్శి కోట్ల ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు పి. అప్పలరాజు,జాలీ వాకర్ వై. నలమహారాజు,శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ పెద్దలు తాడ్డి ఆదినారాయణ, వల్లూరి శ్రీనివాసరావు, ఐ.వి.ప్రసాదరావు,జి. గోవిందరావు,ఆర్.సి.హెచ్. అప్పలనాయుడు,జె.వి.ఎస్. ప్రసాద్,త్యాడ ప్రసాద్ మాష్టారు,ఐ.అప్పలరాజు, జి. సూర్యప్రకాశరావు, కె. రమేష్,టి.రమణ తదితర పెద్దలు భారీగా పాల్గున్నారు.

నూతన సంవత్సర వేడుకలు ఆనందంగా, బాధ్యతతో జరుపుకోవాలి

మద్యం కు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలి ప్రముఖ సైకాలజిస్ట్ డా. ఎన్.వి.ఎస్. సూర్యనారాయణ

విశాలాంధ్ర -విజయనగరం టౌన్ : నూతన సంవత్సర వేడుకలు ఆనందంగా బాధ్యతతో జరుపుకోవాలని మద్యం కు ప్రతి ఒక్కరూ దరంగా ఉండాలని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్. వి. ఎస్ సూర్యనారాయణ అన్నారు ఆదివారం ఆయన మాట్లాడుతూనూతన సంవత్సర వేడుకలను ఆనందంగా జరుపుకోవడం సహజమే అయినప్పటికీ, ఆ ఉత్సాహం జీవితానికి, ప్రాణాలకు ముప్పుగా మారకూడదని ప్రజలకు సూచించారు. ప్రతి సారీ నూతన సంవత్సరం సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేయడం, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల అనేక ప్రమాదాలు సంభవించి ప్రాణాలు కోల్పోవడంజరుగుతుందన్నారు. నూతన సంవత్సర వేడుకల పేరిట మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని, అలాగేద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేయడం చట్టవిరుద్ధమే కాకుండా ప్రాణాలకు తీవ్ర ముప్పు కలిగిస్తుందని పేర్కొన్నారు. గంజాయి , ఇతర మత్తు పదార్థాలు యువతను వ్యసన బాట పట్టించి, వారి ఆరోగ్యం, భవిష్యత్తును నాశనం చేస్తాయని స్పష్టం చేశారు. ముఖ్యంగాపిల్లలు,యువతనియంత్రణలేనింవ్‌పార్టీలకుదూరంగాఉండాలన్నారు.నిజమైన ఆనందం ప్రమాదాల్లో కాకుండా భద్రతలో ఉంటుందన్నారు.నూతన సంవత్సరాన్ని కుటుంబ సభ్యులతో, ఇరుగు పొరుగువారితో కలిసి ఇంట్లోనే ఆనందంగా జరుపుకోవడం ఉత్తమమని హితవు పలికారు. ఇంట్లో జరిగే వేడుకలుకుటుంబఅనుబంధాలనుబలోపేతంచేసి, పిల్లల్లోమంచివిలువలనుపెంపొందిస్తాయన్నారు.తల్లిదండ్రులకునూతన సంవత్సరం రోజున పిల్లలను రాత్రివేళ ఇంటి నుండి బయటకు పంపవద్దని సూచించారు. యౌవన దశలో ఉన్న పిల్లలు స్నేహితుల ఒత్తిడికిసులభంగా లోనవుతారని, ఒక్కరాత్రి నిర్లక్ష్యం జీవితాంతం బాధగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికే పోలీస్ శాఖ అధికారులు పలు సూచనలను నిరంతరంచేపడుతున్నప్పటికీప్రజలందరూవాటిని పట్టించుకోకపోవడంబాధాకరమన్నారు.మనోవైజ్ఞానిక శాస్త్రం ప్రకారం నూతన సంవత్సరం కొత్త నిర్ణయాలకు సరైన సమయమని పేర్కొంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలి, మంచి అలవాట్లు, బాధ్యతాయుత జీవితం ద్వారా మాత్రమే నిజమైన ఆనందం సాధ్యమవుతుందనితెలిపారు.

ఉత్తమ ర్యాంకులు పొందినపూర్వ విద్యార్థులకు సన్మానం

విశాలాంధ్ర-విజయనగరంటౌన్:స్థానికరింగ్‌రోడ్డులోగలశ్రీచైతన్యపాఠశాలలోపూర్వవిద్యార్థులుఐ.ఐ.టి,యన్.ఐ.టి.,నీట్.లలో ఉత్తమ ర్యాంకులు పొంది ప్రస్తుతం బీటెక్లు చదువుతున్న విద్యార్థులకు శాలువాలు కప్పిఘన సన్మానాలు చేసి విద్యార్థులనుఅభినందించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాఠశాల ప్రాంతీయ సంచాలకు లు వి. శ్రీనివాసరావు పాల్గొనివిద్యార్థులనుఉద్దేశించి మాట్లాడుతూ, మీరందరూ 'మంచి ఉత్తమ స్థాయి'ల్లో ఉండాలని కోరుకుంటున్నానని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం .శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఇటువంటి విద్యార్థులు రానున్న తరానికి స్ఫూర్తి దాయకులుగా ఉంటారని అభిప్రాయాన్ని తెలియజేశారు. అలాగే పాఠశాల డీన్లు, ఇన్చార్జులు విద్యార్థులు, ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

రాష్ట్ర స్థాయి కౌశల్ ప్రతిభా పరీక్ష రీల్స్

ప్రెజెంటేషన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర- గరివిడి: తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కౌశల్ ప్రతిభా పరీక్ష రీల్స్ ప్రెజెంటేషన్ పోటీల్లో గరివిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి చేబోలు సూర్య ప్రకాష్ ద్వితీయ బహుమతిని సాధించి ప్రతిభ చాటాడు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ గారి చేతుల మీదుగా సూర్య ప్రకాష్ బహుమతిని అందుకున్నాడు.ఈ విజయానికి గణిత ఉపాధ్యాయులు, కోచ్ బాలమురళి కృష్ణ అందించిన శిక్షణ కీలకంగా నిలిచిందని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. విద్యార్థి ప్రతిభతో పాటు ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమని అన్నారు.ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఎం. నిర్మలతో పాటు ఉపాధ్యాయ బృందం సూర్య ప్రకాష్ మరియు కోచ్ బాలమురళి కృష్ణలను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. గరివిడి పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తీసుకొచ్చిన ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని వారు తెలిపారు.

క్రిస్మస్ సందర్భంగా పెదమజ్జి పేటలో దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-గుర్ల:మండలంలో పెదమజ్జి పేట గ్రామంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని పాస్టర్ అప్పలనాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చలికాలంలో పేద విద్యార్థులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు.క్రిస్మస్ పండుగ ప్రేమ, దయ, సేవా భావాలకు ప్రతీక అని పేర్కొన్న పాస్టర్ అప్పలనాయుడు, సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల చదువుకు ఆరోగ్యం ముఖ్యమని, చలికి రక్షణగా దుప్పట్లు ఉపయోగపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, , తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని అభినందించారు. విద్యార్థులు దుప్పట్లు అందించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శిగా ప్రసాదుల ప్రసాద్‌కు యాదవ సంఘ శుభాకాంక్షలు

విశాలాంధ్ర- విజయనగరం ఫోర్ట్ :తెలుగుదేశం పార్టీ విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ప్రసాదుల ప్రసాద్ని ఆదివారం తెలుగుదేశం పార్టీకి చెందిన యాదవ సోదరి,సోదరులు కలిసి మర్యాదపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రసాదుల ప్రసాద్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ నియామకానికి సహకరించిన విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.పార్టీ అభివృద్ధి, బలోపేతమే లక్ష్యంగా నిబద్ధతతో పనిచేస్తానని, నాయకత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘ నాయకులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపారు.

కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా ధనుర్మాసోత్సవాలు

గోదాదేవిశ్రీవేంకటేశ్వరస్వామి వారికి ఘనంగా పుష్పయాగం

విశాలాంధ్ర -విజయనగరం ఫోర్ట్ :విజయనగరం పట్టణంలోని రింగ్ రోడ్ శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు భక్తుల మధ్య అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీశ్రీనివాస సేవాసంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీమన్నారాయణాచార్యులు, రఘునాథాచార్యుల నిర్వహణలో గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ఘనంగా పుష్పయాగం నిర్వహించారు. అలంకారప్రియుడైన శ్రీనివాసుని వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ఉత్సవాన్ని జయప్రదం చేశారు.ఉదయం వేళ నగర సంకీర్తనలు, తిరుప్పావై పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, ఆలయ ప్రాంగణం భక్తిమయ వాతావరణంతో నిండిపోయింది. ధనుర్మాసోత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తున్నాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ధనుర్మాస వేడుకలు

విశాలాంధ్ర- విజయనగరం టౌన్: శ్రీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీ మురళీకృష్ణ స్వామివారి సన్నిధిలో ధనుర్మాసం సందర్భంగా ప్రతిరోజూ విశేష పూజాది కార్యక్రమంలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం తిరుప్పావడ సేవ అంటే పులిహోర, పళ్ళ,పువ్వులు,స్వీట్స్ తో శ్రీ వెంకటేశ్వరస్వామి రూపం భక్తులచే అలంకరించబడింది. ఈ చిత్రం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమం లో దేవస్థానం పాలకమండలి సభ్యులు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, పెంటపాటి విజయరామయ్య,పచ్చిగుళ్ల రామారావు, పెంటపాటి లక్ష్మణస్వామి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేసారు.

ఘనంగా అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర -విజయనగరం ఫోర్ట్ :అఖిల భారత కాంగ్రెస్ పార్టీ 141వ వ్యవస్థాపక (అవిర్భావ) దినోత్సవాన్ని ఆదివారం ఉదయం 10.30 గంటలకు విజయనగరం జిల్లా అంతట ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటాలను అలంకరించి, పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పరం మిఠాయిలు పంచుకుంటూ ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ మాట్లాడుతూ, 1885లో బొంబాయిలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని, భారత స్వతంత్ర ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. దేశ ప్రజల గుండెల్లో కాంగ్రెస్ పార్టీ చిరస్థాయిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, కరీమ్, బంగారు నాయుడు, షరీఫ్, చంద్రశేఖర్ రెహమాన్, మురలి, అనిల్, ప్రసాద్, బి.వి. రమణ, అచిబాబు, సూరిబాబు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రతన్ టాటా జయంతి వేడుకలు

విశాలాంధ్ర -గరివిడి:గరివిడి లో సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో భారత రత్న రతన్ టాటా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వి. కన్వెన్షన్ ప్రాంగణంలో ఉన్న రతన్ టాటా విగ్రహానికి జెడ్పిటిసి సభ్యులు వాకాడ శ్రీనివాసరావు సహా పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వక్తలు రతన్ టాటా దేశానికి అందించిన సేవలను కొనియాడారు. అనంతరం కేకు కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో సహాయ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రజస్వల కార్యక్రమానికి హాజరైన డా. తలే రాజేష్

విశాలాంధ్ర -రాజాం:రాజాం టౌన్ పరిధి కొండంపేటకు చెందిన దాకరపు శివ-శ్రీమతి రూపా దంపతుల ఆహ్వానం మేరకు ఆదివారం వారి కుమార్తె చి.కు. జోష్ను రజస్వల కార్యక్రమానికి రాజాం నియోజకవర్గం వైఎస్ఆర్‌సీపీ ఇంచార్జి డా. తలే రాజేష్ హాజరై, చిన్నారిని ఆశీర్వదించారు.ఈ సందర్భంగా డా. తలే రాజేష్ మాట్లాడుతూ, సంప్రదాయాలు కుటుంబ బంధాలను మరింత బలపరుస్తాయని పేర్కొంటూ, జోష్నుకు ఆరోగ్యం, విద్యాభివృద్ధి కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాజాం టౌన్ పార్టీ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, టౌన్ పార్టీ ఉపాధ్యక్షులు ముద్దాన సత్యారావు, జిల్లా కల్చరల్ విభాగం అధ్యక్షులు డా. బి. నరేంద్ర, వెంపల లక్ష్మణరావు, నాగిరెడ్డి శ్రీను, బాదిరెడ్డి రమేష్, అలాగే కొండంపేట వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

హాఫ్ సారీ ఫంక్షన్ లో జడ్పీ చైర్ పర్సన్

హాజరైన ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి దంపతులు

విశాలాంధ్ర-వేపాడ :మండలంలోని కుమ్మపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కీర్తిశేషులు దొగ్గ శ్రీరాములు నాయుడు,రెండవ కుమారుడు, మండల పరిషత్ అధ్యక్షుడు దొగ్గ సత్యవంతుడు అన్నగారైన నాయుడు కుమార్తె హాఫ్ శారీ ఫంక్షన్ లో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదివారం పాల్గొని చిరంజీవిని ఆశీర్వదించారు.అలాగే శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి దంపతులు కూడా హాఫ్ సారీ ఫంక్షన్ లో పాల్గొని చిరంజీవిని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మండలంలోని వైసీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పల్లె పండుగ 2.0

డెంకాడ మండలంలో సి.సి. డ్రైన్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే లోకం నాగ మాధవి

విశాలాంధ్ర- డెంకాడ: నెల్లిమర్ల నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఆదివారం డెంకాడ మండలంలోని ఆకులపేట పంచాయతీలో నెల్లిమర్ల శాసనసభ్యురాలు లోకం నాగ మాధవి పర్యటించారు.పల్లె పండుగ 2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సి.సి. డ్రైన్ (మురుగు కాల్వ) పనులకు ఆమె భూమి పూజ చేసి, పనులను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే 'పల్లె పండుగ' ద్వారా మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రతి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, పరిశుభ్రమైన వాతావరణాన్ని పెంపొందించడమే లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు జనసేన నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.